జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 8 | సెప్టెంబర్ | 2025 ◆ పేజీలు : 5



# ఎమ్మార్వో కార్యాలయంలో సిబ్బంది కొరత, కలెక్టర్ సార్ జర పట్టించుకోరా....?

- ప్రజలు సర్టిఫికెట్ల కోసం పడికాపులు కాస్తున్నారు.
- సిబ్బంది కొరతతో సతమతమవుతున్న అధికారులు.
- సిబ్బంది కొరతతో ప్రజలు వేదనలు.
- వారాలు తరబడి సర్టిఫికెట్ల కోసం ప్రజలు ఎదురుచూపులు.



2 లో...



2 లో..

## కాలుష్య విష కోరల్లో....
# పవర్ ప్లాంట్ బాధిత ప్రజలు

- కాలుష్యం వల్ల ప్రాణాంతక వ్యాధులతో చావడమేనా..?
- కాలుష్య ప్రభావం వలన పంటలు దిగుబడి రాక రైతన్నలు గగ్గోలు...

"రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు పంచుతుందని ఆశించిన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ చుట్టుపక్కల గ్రామాల ప్రజల జీవితాల్లో మాత్రం చీకటి తెచ్చిందని చెప్పొచ్చు. ఇటు బొగ్గు చూరతో ఊపిరాడక వ్యాధుల పాలవుతూ... అటు పొలాల్లో పంటలు నాశనమవుతూ.... ఆర్థికంగా కూలిపోతున్న రైతులు "ప్రగతికి మా ప్రాణాలు బలి అవాల్సిందేనా...?" అని వేదనతో గగ్గోలు పెడుతున్నారు."

● మణుగూరు, ప్రజాజ్యోతి

## రైతుల ప్రయోజనాలకు
# కట్టుబడి ఉన్నాం..

- రాష్ట్రంలో ప్రతి రైతు వేసిన పంటను కాపాడుకుంటాం
- యూరియా విషయంలో ఆందోళన అవసరం లేదు


  కేంద్ర ప్రభుత్వం వైఖరి వల్లే కొంత ఇబ్బంది వచ్చింది

  ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేను పరిస్థితిని చక్కదిద్దాం
- కొందరు కావాలని ఏదో ఆశించి ప్రేరేపిస్తే ఆందోళన పడకండి
- రైతు వేదికలలోనూ యూరియా అమ్మకాలు జరుగుతున్నాయి ....
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

2 లో...



# మావోయిస్టుల డంప్ స్వాధీనం




చర్ల, సెప్టెంబర్ 07:(ప్రజా జ్యోతి ): తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లాలోని ఉసూర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని ఎఫ్ ఓ బి గుంజెపర్తి ప్రాంతంలోని అడవిలో భద్రతా దళాలు నిర్వహించిన ఉమ్మడి ఆపరేషన్ లో, ఆయుధాలు పేలుడు తయారీ పరికరాలు, ఇతర సామగ్రిని మావోయిస్టులు అడవులలో దాచిపెట్టిన వాటిని భారీ మొత్తంలో పేలుడు పదార్థాల డంప్ ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నారు. కోబ్రా 205, సి ఆర్ పీ ఎఫ్ 196 యంగ్ ప్లాటూన్ బస్తారియా, సి ఆర్ పీ ఎఫ్ 229 స్వాధీనం చేసుకున్న మావోయిస్టు డంప్ వివరాలు లాత్ మెషిన్, ఎలక్ట్రిక్ జనరేటర్, వాటర్ పంప్, ఎలక్ట్రిక్ కట్టర్ హైడ్రాలిక్ సిలిండర్లు, జేక్స్, స్పూలర్, మోటార్ భాగాలు వంటి భారీ పరికరాలు పారిశ్రామిక వినియోగ వస్తువులు వైర్, టూల్ బాక్స్, డ్రిల్ బిట్స్, కంటైనర్, స్టీల్ ప్లేట్లు పేలుడు నిర్మాణ సామగ్రి మందులు స్వాధీనం చేసుకున్న అన్ని పరికరాలు సామగ్రిని భద్రతా ప్రమాణాల ప్రకారం ధ్వంసం చేశారు తద్వారా మావోయిస్టుల పెద్ద కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశారు. ఈ చర్య మావోయిస్టు నెట్ వర్క్ ను బలహీనపరిచే దిశగా ఒక ముఖ్యమైన విజయం అని పోలీస్ అధికారులు భావిస్తున్నారు .

## సీఎం రాకతో లైట్లు వెలిగాయి...
# సీఎం వెళ్లాక ఆగాయి

- నేషనల్ హైవే అధికారుల తీరు పట్ల వాహనదారులు ప్రజలు ఆగ్రహం
- ఎంపీ ఎమ్మెల్యే మాటలను సైతం బేఖాతార్ చేస్తున్న అధికారులు
- నేషనల్ హైవే సెంటర్ లైటింగ్ అలంకార ప్రాయమేనా..?





2 లో...

## సీఎం రాకతో లైట్లు వెలిగాయి సీఎం వెళ్లాక ఆగాయి

**చంద్రుగొండ, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి:** ఐదు సంవత్సరాలుగా అలంకార ప్రాయంగా ఉన్న నేషనల్ హైవేపై ఉన్న సెంట్రల్ లైటింగ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చంద్రుగొండ పర్యటన నేపథ్యంలో నేషనల్ హైవే అధికారులు ఆగమేఘాల మీద నూతన ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులతో పాటు, మండల ప్రజలు, గ్రామస్తులు కూడా సీఎం రాకతో లైట్లు వెలిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కానీ ఆ సంతోషం ఎన్నో రోజులు కూడా నిలవలేదు. ముఖ్య మంత్రి పర్యటన ముగిసిన రెండోవ రోజు నుంచి కేవలం మండల కేంద్రంలోని లైట్లు వెలగకపోవడంతో దీంతో వాహనదారులతో పాటు మండల ప్రజలు కూడా ఇది మూడునళ్ళా ముచ్చటేనా అంటూ చర్చించుకుంటున్నారు. లైట్ల విషయంలో నేషనల్ హైవే అధికారులకు ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, నేషనల్ హైవే అధికారులను హెచ్చరించినా కూడా వారిలో మార్పు రాకపోవడం పై వారు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కలగజేసుకొని నేషనల్ హైవే ఉన్న లైట్లను యధావిధిగా వెలిగించాలని డిమాండ్ చేస్తున్నారు.

## రైతుల ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నాం ...

- **రాష్ట్రంలో ప్రతి రైతు వేసిన పంటను కాపాడుకుంటాం**
- **యూరియా విషయంలో ఆందోళన అవసరం లేదు**
- **కేంద్ర ప్రభుత్వం వైఖరి వల్లే కొంత ఇబ్బంది వచ్చింది**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేను పరిస్థితిని చక్కదిద్దాం**
- **కొందరు కావాలని ఏదో ఆశించి ప్రేరేపిస్తే ఆందోళన పడకండి**
- **రైతు వేదికలలోనూ యూరియా అమ్మకాలు జరుగుతున్నాయి .... వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 07, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలో రైతులు వేసిన ప్రతి పంటను కాపాడుకుంటామని, రైతు ప్రయోజనాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని యూరియా విషయంలో రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అశ్వారావుపేటలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల రైతులకు యూరియా విషయంలో కొంత ఇబ్బంది వచ్చిన మాట వాస్తవమే అని, అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను సమయానికి స్పందించే పరిస్థితిని చక్కదిద్దామన్నారు. రైతులకు అవసరమైన ఎరువుల విషయంలో రాజీపడేది లేదని యూరియా సరఫరా అవసరమైన మేరకు జరుగుతుందని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూరియా వినియోగాన్ని ముందుగానే అంచనా వేసి ప్రణాళికలకు అనుగుణంగా కేటాయింపు ఇవ్వాలని కేంద్ర మంత్రికి పలుసార్లు లేఖల ద్వారా కోరడమే కాకుండా, రైతులకు అవసరమైన సమయంలో యూరియాకి ఇబ్బందులు వస్తాయని గమనించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి జూలై 8వ తేదీ కేంద్ర ఎరువుల శాఖ మంత్రి నడ్డా ను స్వయంగా కలిసి యూరియాను కేటాయించాలని కోరామన్నారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వ కృషి ఫలితంగానే ఆగస్టు నెలలో కేంద్ర ప్రభుత్వం 40 వేల మెట్రిక్ టన్నుల యూరియాను అదనంగా కేటాయించిందన్నారు. కాకినాడ, కరైకల్, కృష్ణపట్నం, గంగవరం పోర్టుల నుంచి దిగుమతి అవుతున్న యూరియాలో 71,700 మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిందన్నారు. గత 6 రోజుల్లో రాష్ట్రానికి 33 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయబడిందని రైతులకు త్వరితగతిన అందించేందుకు రైతు వేదికలను కూడా ఉపయోగించుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో సుమారు 901 సొసైటీలు ,320 సబ్ సెంటర్లు, 705 ఆగ్రో రైతు సేవ కేంద్రాలు, 110 హాకాసెంటర్లు, 495 రైతు వేదికల ద్వారానే కాకుండా 11 వేల ప్రైవేటు డీలర్ల ద్వారా కూడా యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. ప్రైవేట్ డీలర్లు అధిక ధరలకు అమ్మకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారని బ్లాక్ మార్కెటింగ్ అధిక ధరలకు అమ్మితే వ్యవసాయ శాఖ తరపున కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ ఎఫ్ సి ఎల్ మోతబడడం యూరియా సరఫరాను దెబ్బతీసిందని అయినప్పటికీ గత నెల కంటే ఈనెల సరఫరా పూర్తిస్థాయిలో పెంచి రైతులకు అందించగలిగామన్నారు రాష్ట్రంలో అక్కడక్కడా కొంతమంది ఏదో ఒక ప్రయోజనం ఆశించి రైతులను రెచ్చగొట్టడం లాంటివి చేస్తున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చిందని రైతులు ఎటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వారం రోజుల్లోపే అవసరం ఉన్నంత మేరకు యూరియాను కేంద్ర ప్రభుత్వ సహకారంతో అందించగలమని తెలిపారు.

## కాలుష్య విష కోరల్లో.... పవర్ ప్లాంట్ బాధిత ప్రజలు

- **- కాలుష్యం వల్ల ప్రాణాంతక వ్యాధులతో చావడమేనా..?**
- **- కాలుష్య ప్రభావం వలన పంటలు దిగుబడి రాక రైతన్నలు గగ్గోలు...**



**మణుగూరు, సెప్టెంబర్ 07, (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో నాటి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మించడం జరిగింది. థర్మల్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసిన నాటి నుండి నేటి వరకు ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురౌతున్నారు. పవర్ ప్లాంట్ లో భూములు కోల్పోయిన వారికి ఎంతో కొంత లబ్ధి చేకూరిన మాట వాస్తవమే, కానీ బిటిపిఎస్ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్రమైన దుర్భర పరిస్థితులను అనుభవిస్తూ... కాలుష్య విష కోరల్లో కొట్టుమిట్టాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న దుస్థితి కంటికి కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక కరెంటు కోతలను అధిగమించేందుకు, కరెంటు కోతలను నిర్మూలించేందుకు పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసిన విషయం విధితమే. పినపాక నియోజకవర్గంలోని పినపాక, మణుగూరు మండలాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన పవర్ ప్లాంట్ వల్ల ప్రజలు కాలుష్యం కోరల్లో చిక్కుకొని శ్వాసకోశ వ్యాధులు, ప్రాణాంతక జబ్బులతో ప్రజలు తల్లడిల్లుతున్నారు. పవర్ ప్లాంట్ నిర్వాసిత పరిసర గ్రామాలు సాంబాయిగూడెం, దమ్మక్కపేట చిక్కుడుగుంట, బొమ్మరాజుపల్లి, సీతారాంపురం, పెంటన్నగూడెం, ఉప్పాక, భూపాలపట్నం, బయ్యారం క్రాస్ రోడ్డు, పోతిరెడ్డిపల్లి, రాయిగూడెం తదితర గ్రామాల ప్రజలు వివిధ జబ్బులతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్న పరిస్థితులు దాపరించాయి. వివిధ గ్రామాల్లో ప్రజలు శ్వాసకోస వ్యాధులతో గుండె సంబంధిత వ్యాధులతో బాధిత ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ప్రాణాలను కాపాడుకోవడానికి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న పరిస్థితులు దాపరిస్తున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.

**రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు పంచుతుందని ఆశించిన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ట్ చుట్టుపక్కల గ్రామాల ప్రజల జీవితాల్లో మాత్రం చీకటి తెచ్చిందని చెప్పొచ్చు. ఇటు బొగ్గు చూరతో ఊపిరాడక వ్యాధుల పాలవుతూ... అటు పొలాల్లో పంటలు నాశనమవుతూ.... ఆర్థికంగా కూలిపోతున్న రైతులు "ప్రగతికి మా ప్రాణాలు బలి అవాల్సిందేనా...?" అని వేదనతో గగ్గోలు పెడుతున్నారు.**

### ››› కాలుష్య కోరల్లో మా ప్రాణాలను బలి ఇవ్వడమేనా..?

మమ్మల్ని కాపాడే దిక్కే లేదా... కాలుష్య కోరల్లో మా ప్రాణాలను బలి ఇవ్వడమేనా..? అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. తీవ్రమైన జబ్బులతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్న దుస్థితి కనిపిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజా అవసరాల కోసం పవర్ ప్లాంట్ కు భూములు ఇచ్చి మేము ప్రాణాంతక జబ్బులతో పిల్లాపాపలతో దుర్భర జీవితాలను అనుభవిస్తున్నామని బాధిత ప్రజలు మండిపడుతూ తమ గోడు వెలిబుచ్చుకుంటున్నారు. పవర్ ప్లాంట్ బాయిలర్ల నుండి వచ్చే నల్లని పొగ ద్వారా బొగ్గు చూర అంతా ఇండ్ల పరిసర ప్రాంతాల్లో పడిపోవడంతో బాధిత గ్రామాల ఇళ్లల్లో నల్లని చూర అరచేతి మందంతో విరజిల్లి ఉంటుందని బాధిత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇట్టి విషయాన్ని సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా మా పరిస్థితుల్ని అర్థం చేసుకునే స్థితిలో లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పవర్ ప్లాంట్ కు భూములు ఇచ్చి ఉన్న అరకొర భూముల్లో వివిధ పంటలు వేసుకొని లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేస్తుంటే, నల్లని బొగ్గు చూర దుమ్ము పంట పొలాల్లో పడి దిగుబడి రాని పరిస్థితులు ఉంటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత కౌలు రైతులు తీవ్రస్థాయిలో నష్టపోతున్నటువంటి పరిస్థితులు ఉన్నాయి. కాలుష్య పర్యావరణం వలన రోజు రోజుకు భూముల్లో భూసారం మొత్తం దెబ్బతినే పరిస్థితిలో ఉన్నాయంటూ రైతులు వాపోతున్నారు. నానాటికి పవర్ ప్లాంట్ పరిసరాల ప్రజలు కాలుష్యం వలన తీవ్రమైన అనారోగ్యం పాలవుతూ పంటలు దిగుబడి రాక లక్షల్లో ఆర్థికంగా నష్టపోతున్నా వీటిపై అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

## ఎమ్మార్వో కార్యాలయంలో సిబ్బంది కొరత, కలెక్టర్ సార్ జర పట్టించుకోరా....?

- **ప్రజలు సర్టిఫికెట్ల కోసం పడికాపులు కాస్తున్నారు.**
- **సిబ్బంది కొరతతో సతమతమవుతున్న అధికారులు.**
- **సిబ్బంది కొరతతో ప్రజలు వేదనలు.**
- **వారాలు తరబడి సర్టిఫికెట్ల కోసం ప్రజలు ఎదురుచూపులు.**

**పినపాక, సెప్టెంబర్ 07(ప్రజాజ్యోతి):** పినపాక మండల రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరత తీవ్రమైన సమస్యగా మారింది. సర్టిఫికెట్ల కోసం వచ్చే ప్రజలకు తక్షణ సేవలు అందక, వారాల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది.<మండలంలో ఎమ్మార్వో కార్యాలయంనికి జనన, మరణ, ఆదాయ, కుల, నివాస తదితర సర్టిఫికెట్లకోసం ప్రతిరోజూ వందల సంఖ్యలో జనాలు వస్తుంటారు. విద్యార్థులకు విద్యా రాయితీలు, ఉద్యోగార్థులకు ఉద్యోగ అవకాశాలు, సామాన్యులకు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడానికి ఇవి తప్పనిసరి. కానీ ఎమ్మార్వో కార్యాలయంలో తగినంత సిబ్బంది లేకపోవడంతో దరఖాస్తులు సమయానికి అందకపోవడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

### ››› సిబ్బంది లేక పనులు నిలిచిపోవడమే

ప్రస్తుతం ఉన్న కొద్దిమంది సిబ్బందే అన్ని పనులను నిర్వర్తించాల్సి ఉండడంతో ఫైళ్ళు పేరుకుపోతున్నాయి. ఒక సర్టిఫికెట్ జారీ కావడానికి కూడా పది రోజులు నుంచి నెలరోజుల వరకు ఆలస్యం అవుతోంది. తాత్కాలిక సిబ్బంది ఆధారంగా పనులు నెట్టుకురావడం వల్ల పారదర్శకత లోపించడమే కాక, క్రమబద్ధత దెబ్బతింటోంది. విద్యార్థులు, నిరుద్యోగులు అత్యధికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందాలన్నా, రుణాలు పొందాలన్నా, స్కాలర్ షిప్ లకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఆదాయ, కుల సర్టిఫికెట్లు తప్పనిసరి. కానీ సమయానికి అవి లభించక విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. "మా భవిష్యత్తు పణంగా పెడుతూ ఒక చిన్న సర్టిఫికెట్ కోసం ఇన్ని రోజులు తిరగడం బాధాకరం" అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ♦ ప్రజల డిమాండ్

ప్రజలు మండల కార్యాలయంలో ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అత్యవసర సర్టిఫికెట్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తగ్గుతాయని అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా ఆన్ లైన్ వ్యవస్థను బలోపేతం చేస్తే సమస్యలు కొంతవరకు తగ్గవచ్చని సూచిస్తున్నారు.

### ››› అధికారులు స్పందించాలంటూ పిలుపు

పినపాక ప్రజలు ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. "ప్రజల అవసరాలకు స్పందించడం ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమై ఉండాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేసి, సిబ్బంది సంఖ్యను పెంచితే మాత్రమే సమస్య పరిష్కారం అవుతుంది" అని మండల ప్రజలు చెబుతున్నారు.

మొత్తంగా, పినపాక ఎమ్మార్వో కార్యాలయంలో సిబ్బంది కొరత సమస్య పరిష్కరించకపోతే, ప్రజల ఆవేదన మరింత ముదరే అవకాశం ఉంది.

### మండల రెవెన్యూ అధికారి గొంది గోపాలకృష్ణ వివరణ



పినపాక మండలం పెద్దది కావడంతో దరఖాస్తుల ఎక్కువగా వస్తుంటాయి కావలసినంత సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రస్తుతానికి ఉన్న సిబ్బందితోనే సతమతమవుతూ పనిచేస్తున్నాము. ఆర్ ఐ ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు ఇంకొకరు ఆర్ఐగా వస్తే కొద్దిగా ఉపశమనం దొరుకుతుంది

## ఎమ్మెల్యే కార్యాలయ ముట్టడిలో పాల్గొనడం లేదు

**ఇల్లందు, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి:** జీఓ నెంబర్ 99 ను అనుసరించి రోస్టర్ పాయింట్ 22 వ్యతిరేకిస్తూ ఈనెల 8న జరగనున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడిలో తాము పాల్గొనడం లేదని మాల మహానాడు ఇల్లందు నియోజకవర్గ నాయకులు పండగ ప్రసాద్, తొమ్మిదల బిక్షం తెలిపారు. ఆదివారం స్థానిక సుభాష్ నగర్ లో జరిగిన నియోజకవర్గ మాల మహానాడు సమావేశంలో వారు మాట్లాడారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడిగా ఉన్న అద్దంకి దయాకర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా కొనసాగుతున్నాడన్నారు. మరో వైపు ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి అని పిలుపునివ్వడం అంటే ద్వంద వైఖరిని అవలంబించడమేనన్నారు. ముందుగా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ఇటువంటి నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తే మాలలు నమ్ముతారన్నారు. నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే ఏ సంఘానికి అయినా తమ సంఘ జాతీయ అధ్యక్షులుగా ఉన్న ఎర్రమళ్ళ రాములు, పూల రవీందర్ ఆధ్వర్యంలో మద్దతు ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంఘ నాయకులు బి.ఎన్ గోపాల్, బాబు, గడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ మృతి







**గుండాల. ప్రజా జ్యోతి. 7.** ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ ఎస్ కే భాష అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది గుండాల మండల కేంద్రానికి చెందిన ఎస్కే పాషా రోజు వారి డ్రైవర్ గా పనిచేస్తూ ఉంటాడు ఆదివారం మండల కేంద్రానికి చెందినట్రాక్టర్ తీసుకొని కిన్నెరసాని వాగు నుండి గుండాలకు ఇసుక తరలిస్తుండగా మార్గమధ్యలో సాయన్నపల్లి గుండాల రోడ్డు మార్గంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న లోయలోకి తెచ్చుకొని పోయి డ్రైవర్ పాషా కిందపడి మృతి చెందాడు గుండాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇల్లెందుకు తరలించారు.

## లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీకి పిలుపు

**టేకులపల్లి, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి ):** టేకులపల్లి మండలంలోని సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ఆదివారం జరిగిన లంబాడీల ఆత్మగౌరవ సభలో, సమాజ హక్కుల పరిరక్షణ కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారు.సభలో మాట్లాడిన నేతలు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు , మాజీ ఎంపీ సోయం బాబురావు లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని సుప్రీం కోర్టులో ఫిర్యాదు చేసిన విషయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఇది లంబాడీ సమాజ గౌరవానికి భంగం కలిగించే చర్యగా పేర్కొంటూ, దీనిపై సమాజం ఐక్యంగా స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు .సభలో నేతలు, లంబాడీల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆత్మగౌరవ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించారు.దీనిలో భాగంగా, సోమవారం ఉదయం 10 గంటలకు టేకులపల్లి సేవాలాల్ మహారాజ్ ఆలయం నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. తండాల నుంచి పెద్ద ఎత్తున లంబాడీ యువత, మహిళలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సభలో లంబాడీ సమాజ హక్కులను కాపాడటానికి కట్టుబడి ఉంటామనే తీర్మానంను ఆమోదించారు.ఈ కార్యక్రమంలో ప్రేమచంద్ నాయక్, భూక్య లాలు నాయక్ ,మూడ్ హుస్సేన్ నాయక్,గుగులోత్ కిష్ణ,భూక్య లక్ష్మణ్, ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ,భూక్య దళ్ సింగ్ నాయక్,బాణోత్ రామ నాయక్, భూక్య పాపా నాయక్,భూక్య సైదులు నాయక్,భూక్య రవి రాథోడ్,బొడ పుణ్య నాయక్,ఇతర లంబాడీ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# భవిష్యత్తులో వ్యవసాయానికే ప్రాధాన్యం

- వ్యవసాయంలో అభివృద్ధితోపాటు తృప్తి దొరుకుతుంది
- ఏ శాఖలో ఉన్న ఆయిల్ ఫామ్ అభివృద్ధికి కృషి చేశా
- వ్యవసాయాన్ని, రైతుని నిలబెట్టేలా మీకు మీరు తీర్చిదిద్దుకోవాలి
- ఉద్యానవన పంటలతో రైతుకు ఆర్థిక భరోసా దొరుకుతుంది .... వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- హార్టికల్చర్ విద్యార్థులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల





**అశ్వారావుపేట, సెప్టెంబర్ 07, ప్రజా జ్యోతి:** భవిష్యత్ లో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత లభించనుందని, వ్యవసాయంలో అభివృద్ధితో పాటు తృప్తి దొరుకుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ రాజేంద్ర నగర్ లోని కొండా లక్ష్మణ్ ఉద్యానవన యూనివర్సిటీ నుండి హార్టికల్చర్ 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనకు అశ్వారావుపేట విచ్చేశారు. విద్యార్థులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గంగారంలోని తన వ్యవసాయ క్షేత్రంలో పలు పంటలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ ప్రముఖులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయంలో అవకాశం వచ్చిన ప్రతిసారి ఆయిల్ ఫామ్ అభివృద్ధి కోసం రైతును ఆర్థికంగా నిలబెట్టేందుకు కృషి చేశానన్నారు. అనేక ప్రభుత్వాలలో వివిధ శాఖలు నిర్వహించేందుకు అవకాశం వచ్చిందని తాను ఏ శాఖలో ఉన్న ఆయిల్ ఫామ్ అభివృద్ధిని మాత్రం మరవలేదన్నారు. ఉద్యానవన పంటలతో రైతుకు ఆర్థిక భరోసా దొరుకుతుందని నమ్మి వారిని ఆ దిశగా నడిపించానన్నారు. ప్రతి ఉమ్మడి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, సిద్దిపేటలో వచ్చే నెలలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఓపెన్ కానుందన్నారు. ఇప్పటికీ విదేశాల నుంచి లక్ష కోట్ల రూపాయల ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నామని తెలంగాణ యావత్ పామాయిల్ పంటను విస్తరించాలన్నారు. రైతులు కేవలం వార్షిక పంటల మీద మాత్రమే ఆధారపడితే ఇబ్బందులు తప్పవని ఉద్యాన పంటలతో రైతుకు భరోసా దొరుకుతుందన్నారు. విద్యార్థులుగా ఉన్న మీరు రైతులను వ్యవసాయాన్ని నిలబెట్టేలా మీకు మీరు తయారు కావాలని రైతులకు అండగా నిలబడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫామ్ ఓఎస్ డి కిరణ్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్ కుమార్, రవి సీడ్స్ అధినేత రవి, ఆయిల్ ఫామ్ అసోసియేషన్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, బండి భాస్కర్ పలువురు శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఐటీడీఏలో గిరిజన దర్బార్



**భద్రాచలం, సెప్టెంబర్ 7,ప్రజాజ్యోతి :** భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ ఆదివారం తెలిపారు.ఈ గిరిజన దర్బార్ ఉదయం 10:30గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రారంభమవుతుందని, అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సమయానికి హాజరుకావాలని సూచించారు.గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన అంశాలను లిఖితపూర్వక ఫిర్యాదుల రూపంలో అందజేయాలని, సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని పీవో రాహుల్ తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



**టేకులపల్లి,సెప్టెంబర్07,ప్రజాజ్యోతి:** రోటరీ క్లబ్ అఫ్ కొత్తగూడెం ప్రెసిడెంట్ జె .రవికుమార్.సెక్రెటరీ ఎస్.చలపతి రావు,ముఖ్య అతిథి ఎస్.వి.రామ్ ప్రసాద్ డి .జి 3150,అకాడమిక్ మోనిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్ ల రోటరీ క్లబ్ అఫ్ కొత్తగూడెం వారి ఆధ్వర్యం ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఎం.మోహన్ రావును ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు,ప్రస్తుత ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎం.మోహన్ రావు ప్రతిభని, విద్యార్థులను వివిధ రంగాల పోటీ పరీక్షలలో పాల్గొనేటట్లు ప్రోత్సహిస్తూ వారిని జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా చేస్తున్నందుకు గానూ రోటరీ క్లబ్ అఫ్ కొత్తగూడెం వారు నేషన్ బిల్డర్ అవార్డు ఇస్తూ ఘనంగా అవార్డు గ్రహీత ఉపాధ్యాయుడుని సన్మానించారు.

## పెద్దమ్మతల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- చంద్రగ్రహణం సందర్భంగా 12 గంటల నుండి ఆలయాన్ని మూసివేసిన అధికారులు
- దసరా ఉత్సవాలపై ధర్మకర్త మండలి ఆధ్వర్యంలో సమీక్ష



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 7, ప్రజా జ్యోతి:** పాల్వంచ మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు, ఆదివారం సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లాల నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, కొంతమంది భక్తులు ఆలయ ప్రాంగణంలో అన్నప్రాసనలు, వాహన పూజలు, అమ్మవారికి పొంగలి పెట్టి మొక్కుబడులను చెల్లించుకున్నారు, పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీ హోమం పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, అదేవిధంగా చంద్ర గ్రహణం సందర్భంగా ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి మహా నివేదన అనంతరం పెద్దమ్మతల్లి ఆలయాన్ని ఆలయ ఈవో రజిని కుమారి, ఆలయ చైర్మన్ బాలనేని నాగేశ్వరరావు, ధర్మకర్త మండలి సభ్యుల ఆధ్వర్యంలో మూసివేశారు, అనంతరం వచ్చే నెలలో నిర్వహించే దసరా ఉత్సవాల పై భక్తుల సౌకర్యాలపై, ఉచిత పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి వసతి ఏర్పాట్లపై ఆలయ చైర్మన్ బాలిని నాగేశ్వరావు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రజిని కుమారి తో పాటు, ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు ధర్మకర్త మండలి సభ్యులు, సందు పట్ల రమ్య, చెవు గాని పాపారావు, పెండ్లి రామిరెడ్డి , భూక్య గిరి ప్రసాద్ , అడుసుమిల్లి సాయిబాబు, చెరుకూరి శేఖర్ బాబు ,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు కష్టాన్ని వృథా కానివ్వం : మంత్రి తుమ్మల

- పామాయిల్ పంటతో రైతుకు ఆర్థిక భరోసా
- ఆయిల్ ఫామ్ రైతులకు ప్రభుత్వం అండగా ఉంది
- రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ విస్తరించేలా తెలంగాణ ప్రభుత్వం ప్రణాళిక
- రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో భూములు పంటకు అనుకూలం
- ఆయిల్ ఫామ్ టన్నుకు రూ.25వేలు మద్దతు ధర నా లక్ష్యం
- ఏవైనా చిన్న సమస్యలు ఉంటే అతిగా చూపొద్దు.... రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ ఆకస్మికంగా తనిఖీ చేసిన



వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**అశ్వారావుపేట సెప్టెంబర్ 07, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలో రైతు రాజుగా జీవించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని, పామాయిల్ సాగుతో రైతులు ఆర్థికంగా నిలబడేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అశ్వారావుపేటలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని మంత్రి తుమ్మల ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్వహణ, సామర్థ్యం విషయంలో ఏమైనా చిన్న ,చిన్న సమస్యలు ఉంటే సరి చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, రైతుకు నికర ఆదాయం లభించే పామాయిల్ పంటపై సబ్సిడీలు ఇచ్చి పంట వేసి రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఆయిల్ ఫామ్ పంట తరలింపులో దళారుల దందా లేకుండా నేరుగా సంస్థ సేకరిస్తుందని రవాణా చార్జీలు సైతం చెల్లిస్తుందన్నారు. పామాయిల్ సాగు పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తుందని, రైతులకు ఆర్థిక ఇబ్బందులు రాకుండా సబ్సిడీల రూపంలో అండగా నిలుస్తుందన్నారు. ఈ ప్రాంతంలో కొత్తగా మరో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని నిర్మించేందుకు ఆలోచన ఉందన్నారు. త్వరలోనే సిద్దిపేటలో ఫ్యాక్టరీ రైతులకు అందుబాటులోకి రానిందని పెద్దపల్లి ములుగు సహా మరో ఆరు చోట్ల ఫ్యాక్టరీలు నిర్మిస్తున్నామన్నారు. లీఫ్ అండ్ ఆయిల్ ఎనాలసిస్ ల్యాబ్ కోసం ప్రపోజల్ వచ్చిందని పరిశీలిస్తున్నామన్నారు. ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ రైతుల కృషితో నష్టం అనేది లేకుండా నడుస్తుందన్నారు. మరో మూడు సంవత్సరాల ఈ ప్రభుత్వ కాలంలో తెలంగాణ రాష్ట్రంలో పది లక్షల ఎకరాలలో ఆయిల్ ఫామ్ ను సాగు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. యువత ఉద్యోగాలు, వ్యాపారాల కంటే వ్యవసాయమే లాభదాయకమనే రీతిలో నేడు వ్యవసాయం ఉందన్నారు. ఆయిల్ ఫామ్ లో అంతర్ పంటల ద్వారా అత్యధిక లాభాలు పొందవచ్చని కోకో ,వక్క వంటి పంటలకు పామాయిల్ తోటలు అనుకూలంగా ఉంటాయన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో సైతం విద్యకు ప్రాధాన్యత ఇచ్చి గురుకులాలను ఏర్పాటు చేశానని రైతుల కోసం సాగు తాగునీటికి ఇబ్బంది లేకుండా అనేక కార్యక్రమాల నిర్వహించానన్నారు. బోరాన్, మెగ్నీషియం వంటి ఎరువులు సబ్సిడీపై ఇవ్వాలని రైతుల నుంచి వినతులు వస్తున్నాయని, ప్రభుత్వ పరంగా పరిశీలిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యవసాయానికి వాడే పనిముట్లపై టాక్స్ తీసేయాలని తెలిపానని మ ఈ మధ్య ప్రకటించిన జీఎస్టీ స్లాబ్ లలో వ్యవసాయ పనిముట్లను 12 % నుంచి 5% శాతానికి తగ్గించారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు రైతులు పాల్గొన్నారు.

## ఎస్టీ ఉపకులాలపై అనిశ్చితి తొలగించాలి : లంబాడీ జేఏసీ

- 14న కొత్తగూడెంలో భారీ ర్యాలీ – సుప్రీంకోర్టులో జాబితా సమర్పణపై ఒత్తిడి

**కొత్తగూడెం, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లంబాడీ కుల, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కఠినంగా నిలదీసింది. ఎస్టీ ఉప తెగల మధ్య కొనసాగుతున్న అనిశ్చితి పరిస్థితిని రాష్ట్రం ఇక వాయిదా వేయకుండా వెంటనే పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేసింది.

**1976లో ఆమోదించిన జాబితా..** లంబాడీ, ఎరుకల, యానాది వంటి ఉపకులాలను 1976లోనే పార్లమెంట్ ఎస్టీ జాబితాలో చేర్చింది. కానీ ఆ జాబితా అమలులో రాష్ట్ర స్థాయిలో ఎప్పటికప్పుడు వివాదాలు ఉత్పన్నమవుతూ వచ్చాయి. దీని వల్ల ఉపకులాల మధ్య తారతమ్యం పెరిగి, లబ్ధిదారులు తమ హక్కుల విషయంలో అనిశ్చితికి గురవుతున్నారు. ఈ వివాదానికి తుది తీర్పు తీసుకురావాల్సింది సుప్రీంకోర్టే. అందుకే ఆమోదించబడిన జాబితాను సెప్టెంబర్ 9న సుప్రీం కోర్టులో సమర్పించాలి అని జేఏసీ పట్టుబడుతోంది.

**ర్యాలీతో రాష్ట్రాన్ని కదిలించేందుకు సన్నాహాలు...** "ప్రభుత్వం మౌనం వహిస్తే ఇక నిశ్చలంగా ఉండం" అని జేఏసీ నేతలు హెచ్చరించారు. ఈనెల 14న లక్ష్మీదేవిపల్లి మండల మార్కెట్ యార్డు నుంచి కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. వేలాదిమంది లంబాడీ బిడ్డలు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొనబోతున్న ఈ ర్యాలీతో రాష్ట్రవ్యాప్తంగా చర్చ మొదలవుతుందని



నాయకులు నమ్ముతున్నారు.

**అసమానతలపై లంబాడీల ఆందోళన...** సమాజంలో తాము పొందాల్సిన హక్కులు, అవకాశాలు ఇతర తెగలతో పోలిస్తే తారుమారవుతున్నాయని లంబాడీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉద్యోగాల కోతలు, రిజర్వేషన్‌లో తారతమ్యాలు, పథకాలలో అసమానతలు లాంటి సమస్యలతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "మాకు హక్కులు ఇవ్వాలి, లేకపోతే పోరాటం తప్పదు" అనే ధోరణిలో జేఏసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో జేఏసీ నాయకులు గుగులోత్ రాజేష్ నాయక్, ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, మాలోత్ అశోక్, లావుడియా ప్రసాద్, మూడ్ బాలాజీ, లాల్ సింగ్, రాములు, హత్తిరామ్, శ్రీనివాస్, సత్యనారాయణ, రమేష్ రాథోడ్, భూక్యా రాంబాబు, మంగీలాల్, మాలోత్ గాంధీ, భోజ్యా నాయక్, బోడ లాలు, వీరు నాయక్, దేవీలాల్, తారా సింగ్, ఎల్వీ, బాలు, రాందాస్, చందర్ నాయక్, అమర్ సింగ్, రవి రాథోడ్, గడ్డం శ్రీనివాస్, కృష్ణ, దస్రు, హర్యా నాయక్, గోబ్రియా నాయక్, మోతిలాల్, భద్రు, కాన్సిరాం, కేశవ్, పూర్ణచందర్ నాయక్, భానోత్ శ్రీనివాస్ నాయక్, లచ్చు, హుస్సేన్, శంకర్, వీరన్న, కుశాల్ నాయక్, సీతారాం నాయక్, వెంకట్, మూడ్ అశోక్, మూడ్ జయరాం, బాబూలాల్, రాము, డాక్టర్ వెంకన్న, నాగేష్, మోహన్, కిషన్, దుర్గాప్రసాద్, హరిలాల్, శీను, సాగర్, గణేష్ మహారాజ్, బోడా పునియా తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన గణనాథుల నిమజ్జనాలు

- నిమజ్జన ఏర్పాట్లపై భక్తుల అసంతృప్తి

**భద్రాచలం,ప్రజాజ్యోతి :** భద్రాచలం గోదావరి ఘాట్ వద్ద గణనాథుల నిమజ్జ న కార్యక్రమాలు శాంతియుతంగా ముగిశాయని అధికారులు తెలిపారు. గ త రెండు, మూడు రోజులుగా జరిగిన నవరాత్రి ఉత్సవాల అనంతరం, జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,592 గణనాథ విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు.

**వైభవంగా గణనాథుల ఊరేగింపులు...** నవరాత్రి ఉత్సవాల అనంతరం భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించిన గణనాథ విగ్రహాలను, ఉత్సవ కమిటీ నిర్వాహకులు భారీ ఊరేగింపుల రూపంలో భద్రాచలం కరకట్ట వద్దకు తీసుకువచ్చారు. గజ ఈతగాళ్లు మరియు అధికారుల సమక్షంలో, భారీ క్రేన్ల సహాయంతో గణనాథులను నిమజ్జనం చేశారు.

**భద్రతా ఏర్పాట్లతో నిమజ్జనం...** జూనియర్ కళాశాల నుంచి కరకట్ట వైపు విగ్రహాల ఊరేగింపులు జరిగాయి. ఈ సందర్భంగా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. గోదావరి వరద ఉధృతి కారణంగా భక్తులను గోదావరిలోకి అనుమతించలేదు.

**భక్తులకు తగిన సౌకర్యాల లోపం...** అయితే, నిమజ్జనాల సమయంలో భక్తులకు తాగునీరు, షవర్లు వంటి మౌలిక సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం భక్తుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. గతంలో భక్తుల కోసం ప్రత్యేక షవర్లు ఏర్పాటు చేసినప్పటికీ, ఈసారి అధికారులు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని భక్తులు మండిపడ్డారు.



**అధికారులపై విమర్శలు...** ఉత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు నిమజ్జన కార్యక్రమాలకు హాజరైనప్పటికీ, తాగునీరు, విశ్రాంతి, భద్రతా సౌకర్యాల లోపం పై అధికారులు ని ర్లక్ష్యం ప్రదర్శించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భక్తుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ లో తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులు కోరుతున్నారు.

## కన్నులపండువగా భద్రాచలంలో రామయ్యకు నిత్యకల్యాణం

**భద్రాచలం, సెప్టెంబర్ 7,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం జరిగిన నిత్యకల్యాణ మహోత్సవం భక్తుల కళ్లకు కనువిందు చేసింది. ఉదయం ఆలయ తలుపులు తెరిచిన అర్చకులు, స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలి హరణం నిర్వహించారు. అనంతరం మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక అర్చన నిర్వహించగా, భక్తులు భక్తిరసానుభూతితో మునిగిపోయారు. అంతరాలయంలో ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం జరగగా, ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులు పరమానందాన్ని అనుభవించారు. తరువాత స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్త పద్ధతిలో నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రామయ్య–సీతమ్మల నిత్యకల్యాణాన్ని కన్నులపండువగా వీక్షించి, తమ కోరికల సాధన కోసం పూజలు నిర్వహించారు.

## చంద్రగ్రహణం కారణంగా రామాలయం తలుపుల మూసివేత



**భద్రాచలం, సెప్టెంబర్ 7,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం సంభవించిన చంద్రగ్రహణం నేపథ్యంలో మధ్యాహ్నం 1 గంటకు ఆలయ తలుపులు మూసివేశారు. గ్రహణ ప్రభావం ముగిసిన తర్వాత ఆలయంలో శాస్త్రోక్త పద్ధతిలో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయం సోమవారం ఉదయం 3 గంటలకు తిరిగి తెరచబడుతుందని ఆలయ అధికారులు తెలిపారు . ఈ సందర్భంగా అర్చకులు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ,సుప్రభాతం, ఆరాధన, సేవాకాలం,నివేదన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. భక్తులకు దర్శనం ఉదయం 7:30 నుండి అన్ని పూజా కార్యక్రమాలు పూర్తయిన అనంతరం ఉదయం 7.30 గంటల నుండి భక్తులకు స్వామివారి దర్శనం అనుమతించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గ్రహణకాలంలో ఆలయం మూసివేయబడినందున గ్రహణం ముగిసే వరకు ఆలయం వద్దకు రాకుండా, సోమవారం ఉదయం 7.30 తర్వాత మాత్రమే దర్శనానికి రావాలని అధికారులు భక్తులను కోరారు. సోమవారం ఉదయం నుంచి భారీగా భక్తులు దర్శనానికి వచ్చే అవకాశం ఉన్నందున, ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

## ట్రైబల్ వెల్ఫేర్ అధికారిగా సత్యానందం

**భద్రాచలం, సెప్టెంబరు 7,ప్రజాజ్యోతి :** భద్రాచలం ట్రైబల్ వెల్ఫేర్ ఈఈగా సత్యానందం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గత మే నెలలో ట్రైబల్ వేల్ఫేర్ ఈఈ చంద్రశేఖర్ పదవీవిరమణ చేయడంతో ఆయన స్థానంలో సత్యానందం అదనపు బాధ్యతలు చేపట్టారు. నల్గొండ ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో డీఈగా పనిచేస్తున్న ఆయనను పదోన్నతిపై భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగానికి బదిలీ చేయడంతో ఆయన ఈ మేరకు బాధ్యతలు చేపట్టారు.

## మూతపడిన ఆలయాలు

- పాక్షిక చంద్రగ్రహణం ఎఫెక్ట్




**అశ్వారావుపేట, సెప్టెంబర్ 07, ప్రజాజ్యోతి:** పాక్షిక చంద్రగ్రహణంతో నియోజకవర్గ వ్యాప్తంగా దేవాలయాలు మూతపడ్డాయి. రోజువారి కార్యక్రమాలు పూర్తిచేసి మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయాల తలుపులు మూసివేశారు. నేటి తెల్లవారు జాము నుంచి సంప్రోక్షణ అనంతరం ఆలయాలు తెరుచుకోనున్నాయి. ఇక, చంద్ర గ్రహణం కారణంగా నియోజకవర్గ కేంద్రంలోని కనికా పరమేశ్వరి ఆల యం, జంగారెడ్డిగూడెం రోడ్డులోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరం, డ్రైవర్స్ కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయం, కోనేటి వీధిలోని శివాలయం, గుర్రాల చెరువులోని కనకదుర్గమ్మ ఆలయలను మూసివేశారు, నేటి ఉదయం ఆలయ తలుపులు తెరిచి సంప్రోక్షణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు.